ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

మంగళవారం 25 జూన్ 2024

రెండు గంటలు ఉత్కంఠ

●ఎమ్మెల్సీతో మంత్రి శ్రీధర్ బాబు మంతనాలు

●కార్యకర్తల నినాదాలతో మారుమోగిన నివాసం

●కేడర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మనోవేదన అధిష్ఠానానికి తెలియజేస్తానన్న మంత్రి

7లో..



పొలిటికల్ హీట్

● జగిత్యాలలో జోరుగా మారుతున్న రాజకీయ సమీకరణాలు ● కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో దుమారం రేపుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చేరిక

కాంగ్రెస్‌లో కలవరం..

సీఎం, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కండువా కప్పుకొని కాంగ్రెస్ గూటికి చేరిన వ్యవహారం జగిత్యాల కాంగ్రెస్ పార్టీలో కలవరం సృష్టించింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి నాయకత్వం వహిస్తున్న జగిత్యాల నియోజకవర్గ కాంగ్రెస్‌లో అనూహ్య మార్పులు చోటుచేసుకోవడం కార్యకర్తల్లో కలవరాన్ని నింపింది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఎలాంటి సమాచారం, అంగీకారం లేకుండానే ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో అధిష్ఠానం చేర్చుకోవడం అసంతృప్తిని నింపింది. విషయం తెలుసుకున్న నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు సమీప నియోజకవర్గాలైన కోరుట్ల, ధర్మపురి, వేములవాడ, చొప్పదండి, ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్ తదితర సెగ్మెంట్‌లకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసానికి వస్తూ, పరిస్థితిని తెలుసుకుంటున్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై జీవన్‌రెడ్డి అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసే యోచనతో జీవన్‌రెడ్డి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.



జీవన్ రెడ్డితో మాట్లాడుతున్న విప్ లక్ష్మణ్ కుమార్, నాయకులు జువ్వాడి నర్సింగ్ రావు

జగిత్యాల, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో రాజకీయం గరం గరంగా మారింది. తాజాగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన వ్యవహారం రాజకీయ దుమారాన్ని రేపుతోంది. ఒక వైపు కాంగ్రెస్ పార్టీలో కలవరం, బీఆర్ఎస్‌లో కల్లోలం చోటు చేసుకోవడానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పార్టీ మార్పు వ్యవహారం కారణంగా నిలిచింది. ఇటీవలనే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసి కేంద్రంలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు ఏర్పడి పాలన గాడిన పడుతున్న సమయంలో జగిత్యాలలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కడం ఆసక్తిదాయకమైంది. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పార్టీ మార్పు వ్యవహారాన్ని ఒకవైపు కొందరు బీఆర్ఎస్ నేతలు, మరో వైపు కొందరు కాంగ్రెస్ నాయకులు తప్పుపడుతున్నారు.

జగిత్యాల బీఆర్ఎస్‌లో కల్లోలం...

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన డాక్టర్ సంజయ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో తాజాగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ బీఫాంపై పోటీ చేసి విజయం సాధించిన ఎమ్మెల్యే కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో ఎలాంటి సమాలోచనలు జరపకుండా స్వతంత్రంగా వ్యవహరించి పార్టీ మారడం ఏమిటని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం శ్రేణుల్లో కలవరం సృష్టించింది. సంజయ్ పార్టీ మార్పు వ్యవహారాన్ని నిరసిస్తూ జగిత్యాలలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు జిల్లా నేతలు ఆందోళనలు జరిపారు. జగిత్యాల తహసీల్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించడం, ఎమ్మెల్యే దిష్టి బొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే నిర్వహిస్తున్న కంటి ఆసుపత్రి, నివాసం వద్దకు వెళ్లి ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్లకార్డుల ప్రదర్శించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు నేతృత్వంలో జరిగిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డిలున్నారు. ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మార్పు జగిత్యాల బీఆర్ఎస్ నియోజకవర్గ బాధ్యతలు ఎవరు చేపడుతారన్న చర్చలు పార్టీ వర్గాల్లో చోటుచేసుకుంటున్నాయి.

భరోసా...బుజ్జగింపులు

అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి భరోసా కల్పించడానికి కొందరు కాంగ్రెస్ నేతలు, బుజ్జగింపులు జరపడానికి మరికొందరు కాంగ్రెస్ నేతలు జగిత్యాలలోని ఆయన నివాసానికి రాకపోకలు జోరుగా సాగించారు. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్ జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు. వీరితో పాటు పలువురు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు, మంత్రులు సైతం ఫోన్‌లో ఎమ్మెల్సీతో టచ్‌లో ఉంటున్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని బుజ్జగించడానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ప్రయత్నించారు.

ఎమ్మెల్సీ నివాసానికి నేతల క్యూ

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి నివాసానికి సోమవారం పలువురు కాంగ్రెస్ నేతలు క్యూ కట్టారు. జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను తాజాగా సీఎం రేవంత్ రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడంపై జీవన్‌రెడ్డి కినుక వహించినట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ నివాసానికి కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జీవన్‌రెడ్డికి భరోసా ఇస్తూ, బుజ్జగించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లు సైతం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసానికి వచ్చారు. కొద్దిసేపు జీవన్‌రెడ్డితో మాట్లాడి కాంగ్రెస్ పరిస్థితిని చర్చించారు. కార్యకర్తలు, పార్టీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో జీవన్ రెడ్డి నివాసం వద్దకు వచ్చి జీవన్ రెడ్డికి మద్దతుగా నినాదాలు చేశారు. జై జీవనన్న, జై జై జీవనన్న నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగిపోయింది. జగిత్యాలకు వస్తున్న కార్యకర్తలు, నేతల సంఖ్య పెరగడంతో పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు. జీవన్‌రెడ్డి నివాసానికి సమీపంలో ప్రధాన రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నివారించారు.

జీవన్ రెడ్డికి అండగా ఉంటాం
: ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి అండగా ఉంటామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని కలిసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న జీవన్‌రెడ్డి మనస్తాపానికి గురయ్యారన్న సమాచారంతో వచ్చి పలకరించామన్నారు. పలువురు ఏఐసీసీ నేతలు, పీసీసీ నేతలు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో ఫోన్ మాట్లాడుతున్నారన్నారు. పరిస్థితి సద్దుమనుగుతుందని, కార్యకర్తలు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని తెలిపారు.

ఆయిల్ పామ్ నిధులు విడుదల

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్

జగిత్యాల అర్బన్, జూన్ 24: జగిత్యాల జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సాగు ప్రోత్సాహక నిధులు విడుదల అయినట్లు జిల్లా ఉద్యానవన,పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్ సింగ్ తెలిపారు. 2022-23 సంవత్సరం రెండవ సంవత్సరం సాగుకు సంబంధించి 661 మంది రైతులకు చెందిన 1796 ఎకరాలకు సంబంధించిన రూ.75.39 లక్షల రూపాయలు రాయితీ విడుదల అయ్యిందన్నారు. అలాగే 2023-24 సంవత్సరానికి సంబంధించి మిగిలి పోయిన 296 మంది రైతులకు చెందిన 646 ఎకరాలకు గానూ రెండవ దఫా కింద రూ. 27.11 లక్షల రూపాయల రాయితీ సొమ్మును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

జగిత్యాల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను సంబంధిత శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 68 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లోని తమ తమ లాగిన్‌లో గల ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకొని సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. శాశ్వత పరిష్కార దిశగా జవాబు అందించాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

●రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్‌ను విడుదల చేయాలని ప్రైవేట్ కళాశాలల యాజమాన్య సంఘం కోరింది. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. సంఘ బాధ్యులు యాద రామకృష్ణ, శ్రీపాద నరేష్, పోతాని ప్రవీణ్, నవీన్‌కుమార్, ముసిపట్ల రాజేందర్, వేణుగోపాల్ తదితరులున్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

ఎస్పీ అశోక్ కుమార్



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): పోలీసుల వద్దకు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు.

వ్యక్తికి గౌరవం లేకపోతే...పదవి ఎందుకు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో ఎమ్మెల్సీ ఘాటు వ్యాఖ్య

జగిత్యాల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): వ్యక్తికి గౌరవం లేకపోతే..ప్రజా జీవితం ఎందుకు...పదవి ఎందుకు అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఘాటైన వ్యాఖ్యను చేశారు. సోమవారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలిశారు. వారి మధ్య చోటు చేసుకున్న సంభాషణకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రకారకాల ఆలోచనలు, రాజకీయాలు ఉంటయి కావచ్చు..కానీ వ్యక్తికి గౌరవం లేనప్పుడు ప్రజా జీవితం, పదవి అవసరం లేవని వెల్లడించారు. ఇంతకాలం గౌరవంతో కొనసాగినానని అంటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

అభివృద్ధి, సంక్షేమం కోసమే కాంగ్రెస్‌లో చేరా

ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్

జగిత్యాల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్‌లో చేరానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఫోన్ ద్వారా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో జగిత్యాలలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిపామని, మరింత అభివృద్ధి, సంక్షేమ పనులు నిలిచిపోయాయన్నారు. వాటిని పూర్తి చేయాలన్న సంకల్పంతో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరానన్నారు. కాంగ్రెస్ సర్కారు పెద్దలతో కలిసి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తానన్నారు. అన్ని వర్గాల నాయకులతో కలిసి పనిచేస్తానని, ఎవరినీ నిర్లక్ష్యం చేయనని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలు, కార్యకర్తలు తనకు ఎప్పటిమాదిరిగానే సహకరించాలని కోరుతున్నానన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి : డీఎంహెచ్‌వో

మల్లాపూర్, జూన్, 24 : ప్రజలు తమ నివాస పరిసరాలతో పాటు వీధులను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి సీజనల్ వ్యాధులు దరిచేరవని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సూచించారు. సోమవారం మల్లాపూర్ పీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రిలోని వివారలు తెలుసుకున్నారు. అనంతరం రాఘవపుట గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నాయని రోడ్లు, మురికి కాలువలు, నీటి తొట్టిలను పరిశీలించి గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటితో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఇండ్లల్లోని నీటి నిలువ తొట్టిలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. వారంలో ప్రతి శుక్రవారం రోజున డ్రై డే కార్యక్రమం చేపట్టి ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో కొబ్బరి చిప్పలతో పాటు చెత్త పోగు కాకుండా చూసుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మండల వైద్యాధికారి వాహినిరెడ్డి, అధికారులు సత్యనారాయణ, శ్రీధర్, రామ్‌మెహన్, శ్రీనివాస్, విక్రమ్, ఏఎన్ఎంలు, ఆశలు, సిబ్బంది, పాల్గొన్నారు.

పార్టీని వీడడం ఆత్మహత్యకన్నా దీనమైన చర్య

● మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ● జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే సంజయ్ దిష్టిబొమ్మ దహనం

●ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించిన బీఆర్ఎస్ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఒక పార్టీ టికెట్‌పై గెలిచి, మరొక పార్టీకి వెళ్లిన నేతల పరిస్థితి ఆత్మహత్య కన్నా దీనమైన చర్య అని, అలాంటి వారు బతికున్నా శవంతో సమానం అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ బీఆర్ఎస్‌ను వీడి, కాంగ్రెస్‌లో చేరడం పట్ల బీఆర్ఎస్ జిల్లా శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించుకున్న అనంతరం స్థానిక తహసీల్ చౌరస్తా వద్దకు చేరుకొని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి, ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించి, సంజయ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ ఇంటిముందు బైఠాయించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మంచి పాలన అందిస్తుందనే నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారన్నారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి ప్రజాప్రతినిధులు పార్టీ వీడడం దురదృష్టకరం అన్నారు. ఈ పరిస్థితి ఆత్మహత్యకన్నా దీనమైందిగా అభివర్ణించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఉద్యమకారుడు కాదని, ఏనాడు జై తెలంగాణ అని నినదించలేదన్నారు. ఉద్యమకారులను కాదని, పరిస్థితులకు అనుగుణంగా ఆనాడు టికెట్ ఇస్తే, ఓడిపోయిన గెలిచిన వారితో సమానంగా కేసీఆర్, కవిత, కేటీఆర్‌లు ప్రాధాన్యం ఇచ్చారని, తదనంతరం కూడా 2018, 2023లో సైతం పార్టీ టికెట్లు ఇచ్చి గెలుపునకు దోహదపడిన మర్చి పోవడం దురదృష్టకరం అన్నారు. వెంటనే పదవికి రాజీనామా చేయాలన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ పార్టీని మోసం చేసిన వారు ఎవరూ పైకి రారని, సంజయ్‌కి కూడా అదే గతి పడుతుందన్నారు. దమ్ముంటే పార్టీకి, పదవికి రాజీనామా చేసి తిరిగి గెలవాలని ఆయన సవాల్ విసిరారు. అనంతరం రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంత సురేష్ మాట్లాడారు. కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని ఏ కష్టం వచ్చిన పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు. తాము సైతం కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్యాల: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడాన్ని నిరసిస్తూ మల్యాలలో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. బ్లాక్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యేకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. నూకపల్లి సింగిల్‌విండో చైర్మన్ బోయినిపల్లి మధుసూధన్‌రావు, ముత్యంపేట మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, రాంపూర్ మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, కొండగట్టు డైరెక్టర్లు పోచమ్మల ప్రవీణ్, కొంక నర్సయ్య, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు గడ్డం రాజేశం, అల్లూరి అనిల్‌రెడ్డి, అజర్, రియాజ్, డిష్ మల్లేశం, చిన్నదుర్గయ్య పాల్గొన్నారు.

మెట్‌పల్లి : టీఆర్ఎస్ జగిత్యాల నియోజక వర్గం అభ్యర్థిగా గెలిచిన డాక్టర్ సంజయ్ రాత్రికిరాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పదవికి రాజీనామా చేయాలని ఎంపీపీ మారు సాయిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని శాస్త్రి చౌరస్తాలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని ఖండిస్తూ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ గుర్తుతో గెలిచిన డాక్టర్ సంజయ్ స్వలాభం కోసం రాత్రికిరాత్రి కాంగ్రెస్‌లో చేరడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బంగా రుకాళ్ల కిషోర్, మాజీ సర్పంచులు పీసు తిరుపతిరెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీధర్, రవి, నాయకులు శ్రీనివాస్, మల్లయ్య, పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు

భగత్‌నగర్, జూన్ 24: జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామారపు వెంకటేష్, మచ్చ రమేశ్ పిలుపునిచ్చారు.

సోమవారం నగరంలోని పార్టీ కార్యాయంలో వారు మాట్లాడుతూ పెద్దపల్లి బైపాస్ రోడ్డులో గల ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నా మని తెలిపారు. కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేయడానికి నూతన విద్యా విధానం తీసుకొచ్చారని ఆరోపించారు. తెలంగాణ విభజన హామీల్లో తెలంగాణకు రావలసిన నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, ఐఐటీ, ఐఎం లాంటి విద్యా సంస్థలను తెలంగాణకు కేటాయించకుండా మోదీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ఛైర్మెన్ ప్రదీప్ కుమార్ జోషి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు సమస్యలతో సతమతమవుతున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో కనీస సదుపాయాలు కల్పించాని డిమాండ్ చేశారు.

బాసర గోదావరిలో చొప్పదండి ఎమ్మెల్యే సతీమణికి పిండప్రదానం



అంతిమసంస్కార కార్యక్రమాలను నిర్వహిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సత్యం, పిల్లలు

బాసర, జూన్, 24: కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే సత్యం సతీమణి రూప అస్తికలను సోమవారం నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నదిలో కలిపారు. ఇటీవల చొప్పదండి ఎమ్మెల్యే సత్యం భార్య రూప ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే సత్యంతో పాటు కుటుంబ సభ్యులు అంతిమ సంస్కార కార్య క్రమాలను నిర్వహించారు. పిండ ప్రదానం, అస్తికలను ఎమ్మెల్యే సత్యం నదిలో కలిపారు.

డెయిరీ ఫామ్ యజమాని ఆత్మహత్య

బర్కత్‌పుర, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): డెయిరీ ఫామ్ యజమాని డి. వంశీ కృష్ణారెడ్డి ఓ హోటల్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం. కరీంనగర్ జిల్లా రేకుర్తి మండలం సాలెహ్‌నగర్‌కు చెందిన మల్లారెడ్డి కుమారుడు డి. వంశీ కృష్ణారెడ్డి (27) బాలాపూర్‌లో డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నాడు. కాచిగూడలోని ఓ హోటల్‌లో ఆదివారం ఉదయం 203 గదిని అద్దెకు తీసుకున్నాడు. సోమవారం ఉదయం రూమ్ ఖాళీ చేస్తానని చెప్పడంతో హోటల్ సిబ్బంది వంశీ కృష్ణారెడ్డి ఉన్న గది తలుపు తడితే తీయలేదు. సిబ్బంది హోటల్ మేనేజర్‌కు ఈ విషయం చెప్పారు. కాచిగూడ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గది తలుపులు పగులగొట్టి చూడగా వంశీ కృష్ణారెడ్డి చనిపోయి ఉన్నాడు. పక్కన పురుగుల మందు డబ్బా ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియవని తెలిపారు.

ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



అంజనను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జూన్ 24: ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత మార్కులతో ప్రతిభ చాటారు. బైపీసీ విభాగంలో జె.అంజన 439/440 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకులో నిలిచింది. ఎంపీసీ విభాగంలో 30 మంది విద్యార్థులు 470 మార్కులకుగాను 468 మార్కులు సాధించారు. 81 మంది విద్యార్థులు 467 మార్కులు, 131 మంది విద్యార్థులు 466 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో స్టేట్ ఫస్ట్ మార్కులతో పాటు నలుగురు విద్యార్థులు 438 మార్కులు, 14 మంది 437 మార్కులు, 34 మంది 436 మార్కులు సాధించారు. ఎంఈసీలో టి.అఖిల్, వి.రిషిత, ఎం.శ్రీవల్లి పటేల్ 500 మార్కులకు 494 మార్కులు సాధించి రాష్ట్రంలోనే అత్యున్నత స్థానం పొందారు. సీఈసీ విభాగంలో బి.గ్రీష్మ, సిహెచ్. నిఖిత 500 మార్కులకు 494 మార్కులు సాధించారు. అన్ని విభాగాలలో అత్యద్భుత ఫలితాలు సాధించడంలో అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమైందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పటిష్ట ప్రణాళికతో విద్యా బోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషితో ఇంతటి ఘనవిజయం సాధ్యమైందన్నారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను నరేందర్‌రెడ్డి అభినందించారు.

నైపర్‌లో శాతవాహన ఫార్మసీ విద్యార్థులకు ర్యాంకులు



జి. నందిని



వై. స్నేహ



ఎం,సాయికిరణ్

గణేశ్‌నగర్,జూన్ 24: శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్‌ఎండీ క్యాంపస్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రతిష్టాత్మక జాతీయ ఫార్మసీ విద్యా, పరిశోధన సంస్థ (నైపర్) ప్రవేశపరీక్షలో ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే శ్రీశైలం తెలిపారు. ఈ పరీక్షలో జి.నందిని 296, వై.స్నేహ 429, యం.సాయికిరణ్ 1633, జి.ప్రత్యూష 1819, ఏ.లోకేశ్ 2244, బి.వల్లవి 2,327, ఏ.రమ్య 2,661, పి సాయిపూజిత 2931, యం భానుమతి 3324, ఎస్ జగదీష్3940, జి ప్రగతి 5228 ర్యాంకులు సాధించి ఎంఫార్మసీలో ప్రవేశానికి అర్హత సాధించారని తెలిపారు. ఈ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య లభిస్తుందని, అంతర్జాతీయంగా పేరుగాంచిన శాస్త్రవేత్తలతో కలిసి పనిచేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థికి రెండు సంవత్సరాల ఎం ఫార్మసీ కోర్సు వ్యవధి కాలంలో ప్రతినెలా 12,400 రూపాయల ఉపకార వేతనం లభిస్తుందని అన్నారు. ప్రవేశానికి అర్హతపొందిన విద్యార్థులను విశ్వవిద్యాలయ ఇంచార్జ్ ఉపకులపతి సురేంద్రమోహన్ ఐఏఎస్, రిజిస్ట్రార్ ఆచార్య యం వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిషోర్, అధ్యాపకులు అభినందించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 16 మంది విద్యార్థుల డీబార్

గణేశ్‌నగర్, జూన్ 24: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండో, నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం 16 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధి కారి డాక్టర్ ఎస్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల, ధర్మపురిలో ఆరు గురు, శివాని డిగ్రీ కళాశాల సుల్తానాబాద్‌లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంథని లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఐదుగురు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుస్నాబాద్‌లో ఒకరు, శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాలలో ఒకరు. మొత్తం 16 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

తంగళ్లపల్లి, జూన్ 24: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిలవడంతో ఇంజినీరింగ్ చేయాలనే తన కల నెరవేరదని మనస్తాపం చెంది తోకల సాక్షి(18) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన తోకల సాక్షి(18) మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్‌లో ఇటీవల ఇంటర్మీడియెట్ చదివింది. వార్షిక ఫలితాల్లో మ్యాథ్స్ సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యింది. అనంతరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీతోపాటు ఎంసెట్ రాసింది. ఈ క్రమంలో ముందుగా ఎంసెట్ ఫలితాలు రాగా అందులో అర్హత సాధించింది. సోమవారం విడుదలైన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిల్ అయ్యింది. దీంతో ఇంజనీరింగ్ చేయాలనే తన కల నెరవేరడం లేదని మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 24: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్‌లో సోమవారం బానోతు అక్షయ(19) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. కరీంనగర్‌లో నర్సింగ్ రెండో సంవత్సరం చదువుతున్న అక్షయ పరీక్షల అనంతరం ఇంటికి వచ్చింది. కాలేజీ ప్రారంభం అవుతున్నదున మూడో సంవత్సరానికి సంబంధించిన ఫీజు విషయమై తండ్రిని అడిగింది. ప్రస్తుతానికి డబ్బులు లేవని, జీతం వచ్చాక ఫీజు డబ్బులు ఇస్తానని తండ్రి రాజేషం చెప్పడంతో మనస్తాపంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. అక్షయ చిన్నచిన్న విష యాలకు అలుగుతూ గదిలో తలుపువేసుకుని కొంత సేపటి తర్వాత వచ్చేదని, కానీ సోమవారం సాయంత్రానికి గాని తలుపులు తీయకపోవడంతో తండ్రి రాజేషం తలుపులు పగుల గొట్టి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. మృతురాలి సోదరి అనీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం



వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం

ఎల్లారెడ్డిపేట, జూన్ 24: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో ఆదివారం రాత్రి దొంగ చోరీకి యత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఏటీఎం దొంగత నానికి వచ్చిన వ్యక్తి మిషన్ నుంచి డబ్బులు దొంగి లించేందుకు యత్నించాడు. ఫలితం లేకపోవడంతో వెళ్లి పోయాడు. ఆన్‌లైన్ ద్వారా విషయం తెలుసుకున్న బ్యాంకు అధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఘటన స్థలాన్ని పరిశీలించారు. సోమవారం ఉదయం ప్రత్యేక పోలీసులు వేలి ముద్రలను సేకరించారు. సీసీ కెమెరాలో నిక్షిప్తమైన వీడియోను విడుదల చేశారు. చోరీకి విఫలయత్నం చేసిన వ్యక్తిని గుర్తిస్తే 87126 56374, 8712656373, 9000457637 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు గంటలు ఉత్కంఠ

● ఎమ్మెల్సీతో మంత్రి శ్రీధర్‌బాబు మంతనాలు ● కార్యకర్తల నినాదాలతో మారుమోగిన నివాసం

● క్యాడర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మనోవేదన అధిష్టానానికి తెలియజేస్తానన్న మంత్రి



జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాయకులు

జగిత్యాల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జగిత్యాలలో గల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి నివాసంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సుమారు రెండు గంటల పాటు గడిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడంపై కినుక వహించారన్న సమాచారం మేరకు సోమవారం రాత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జగిత్యాలకు వచ్చారు. శ్రీధర్‌బాబు కాన్వాయ్ రావడంతోనే అక్కడ పెద్ద ఎత్తున గుమిగూడిన కాంగ్రెస్ కార్యకర్తలు, జీవన్‌రెడ్డి అభిమానులు జోరున నినాదాలు చేశారు. జీవన్‌రెడ్డి జిందాబాద్, జీవనన్నకు జై జై అంటూ నినదించారు. కార్యకర్తలకు నమస్కరిస్తూ మంత్రి శ్రీధర్ బాబు ఇందిరాభవన్‌లోని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. గదికి గడియ వేసుకొని సుదీర్ఘ సమయం పాటు చర్చించారు. ముందుగా ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్‌లతో ముచ్చటించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావుతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో అభిప్రాయాలను, మనో వేదనను పంచుకున్నారు.

ఎమ్మెల్సీ నివాసంలో మంత్రి శ్రీధర్ బాబు ముచ్చటిస్తున్న సమయంలో ఆరుబయట వాకిలిలో, రహదారిపై, ప్రహరీ గోడలపై ఉన్న కార్యకర్తలు, అభిమానులు జీవన్‌రెడ్డికి మద్దతుగా నినదించారు. లోపల ఏమి జరుగుతుందో తెలియక క్యాడర్ అయోమయానికి గురైంది. ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో...ఏమి జరగనుందోనన్న ఆసక్తితో అభిమానులు, కార్యకర్తలు అక్కడే నిలబడి ఆసక్తిగా ఎదురుచూశారు. ఎట్టకేలకు సుమారు రెండు గంటల తరువాత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కార్యకర్తలకు నమస్క రించి అభిప్రాయాన్ని వెల్లడించారు. నిన్నటి రోజున జరిగిన సంఘటనతో ఎమ్మెల్సీ మనస్తాపానికి గురయ్యారన్న సమాచారం తెలుసుకొని మర్యాద పూర్వకంగా కలవడానికి జగిత్యాలకు వచ్చానని ప్రకటించారు. సుదీర్ఘంగా జీవన్ రెడ్డితో మాట్లాడి ఆయన మనోవేదనను, అభిప్రాయాలను తెలుసుకున్నానని స్పష్టం చేశారు. ఇక్కడ చోటుచేసుకున్న పరిస్థితి, క్యాడర్ అభిప్రాయాలు, జీవన్ రెడ్డి మనోవేదనను ఏఐసీసీ, పీసీసీ అగ్రనేతలతో పాటు సీఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తానన్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి పెద్ద దిక్కుగా ఉన్నారని, రాబోయే కాలంలో సైతం కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా వ్యవహరిస్తారని ప్రకటించారు. క్యాడర్ అధైర్య పడొద్దని కోరారు. జీవన్‌రెడ్డి నివాసానికి అధిక సంఖ్యలో జనం రాకుండా పోలీసులు బందోబస్తు నిర్వ హించారు. జీవన్‌రెడ్డి నివాసానికి వచ్చే రహదారులను బారీగేట్లతో మూసి వేశారు. వాహనాల రాకపోకలను నియంత్రించారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

కోరుట్ల మండలం గుమ్లాపూర్‌లో 7 తులాల బంగారం, లక్ష నగదు

జమ్మికుంట మండలం కొత్తపల్లిలో లక్ష నగదు, బంగారం అపహరణ



కోరుట్ల మండలం గుమ్లాపూర్‌లో క్లూస్ టీం తనిఖీలు

కోరుట్ల రూరల్, జూన్ 24 : మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడ్డారు. పోలీసులు..బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ తెడ్డు రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి ఆదివారం రాత్రి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటి పక్కనే ఉన్న వారు తలుపు తీసి ఉన్న విషయాన్ని గుర్తించి రమేష్ కు సమాచారం అందించారు. హుటాహుటిన రమేష్ ఇంటికి చేరుకుని చూడగా ప్రధాన ద్వారానికి వేసిన తాళం పగులగొట్టి ఉండటంతో పాటు ఇంటిలోని సామగ్రి చిందర వందరగా పడిఉన్నాయి. బెడ్ రూంలో ఉన్న బీరువాలోని వస్తువులు తీసి బయట పడేసి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే కోరుట్ల పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ సురేష్ బాబు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రమేష్



జమ్మికుంట మండలం కొత్తపల్లిలో చిందర వందరగా పడేసి ఉన్న సామగ్రి

ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బీరువాలో ఉన్న 7 తులాల బంగారు ఆభరణాలు, లక్ష నగదు చోరీకి గురైనట్లు బాధితుడు రమేష్ ఫిర్యాదు పేర్కొన్నాడు.

జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో..

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లికి చెందిన శ్రీపతి రమేష్ ఈ నెల 22న ఓదెల మండలం గుంపులలో ఓ శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. 24న ఉదయం 6.30కు ఇంటికి వచ్చిన రమేష్‌కు మెయిన్ గేట్ తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి ఆందోళనకు గురయ్యాడు. తలుపులు తెరిచి ఉండగా లోనికి వెళ్లాడు. బీరువా తలుపులు తెరుచుకొని ఉన్నాయి. అందులో ఉన్న లక్ష నగదు, 23 వేల రూపాయల విలువ గల బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ యువకుడి మృతి



చందు(ఫైల్)

కరీంనగర్ క్రైం/ముస్తాబాద్, జూన్ 24: పెద్దలు ఒప్పుకోరనే భయంతో ఓ ప్రేమజంట పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వారిలో యువకుడు మృతి చెందగా యువతి చికిత్స పొందుతోంది. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన పెంటం చందు(23), అదే గ్రామానికి చెందిన ఓ యువతి కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఆ యువతి కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీని చదువుతోంది. చందు ఆదివారం గూడెం నుంచి యువతిని కలిసేందుకు కరీంనగర్‌కు వచ్చాడు. మధ్యాహ్నం చందు ఫోన్ నుంచి అతడి సోదరుడు నవీన్‌కుమార్‌కు యువతి ఫోన్ చేసి చందు, తాను ప్రేమించుకున్నామని, పెద్దలు ఒప్పుకోరనే భయంతో చనిపోదామని ఇద్దరం నిర్ణయించుకుని కరీంనగర్ ఉజ్వలపార్కు వద్ద పురుగుల మందుతాగామని తెలిపింది. ఒక వ్యక్తి సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చామని చెప్పి ఫోన్ పెట్టేసింది. దీంతో నవీన్‌కుమార్ వెంటనే తన బావతో కలిసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి రాగా చందు చికిత్సకు సహకరించడంలేదని వైద్యులు తెలిపారు. వారు ఇద్దరినీ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చందు చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. యువతిని వారి తల్లిదండ్రులు ఎల్లారెడ్డిపేట ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాన్ షాప్‌లలో పోలీసుల తనిఖీలు

సిరిసిల్ల క్రైం, జూన్ 24: సిరిసిల్ల పట్టణంలోని పలు పాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో సోమవారం పోలీస్ జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నిషేధిత గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నారనే సమాచారంపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ రఘుపతి మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నా రు. మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తోంద న్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లోగానీ డయల్ 100కుగానీ సమాచారం అందించాలని సూచించారు.



పాన్‌షాప్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పశువుల అంగడిలో వసూళ్ల దందా

జమ్మికుంట, జూన్ 24: జమ్మికుంట మున్సిపాల్టీ పరిధిలో ప్రతి మంగళవారం నిర్వహించే పశువుల అంగడిలో గుత్తేదారు అడ్డగోలు వసూళ్లకు తెరలేపారు. మున్సి పాల్టీకి ప్రతి ఏటా సుమారు 40 లక్షల రూపాయల మేరా ఆదాయం సమకూర్చే అం గడిని అధికారులు గాలికి వదిలేశారు. దీంతో గుత్తేదారు ఆడిందే ఆట పాడిందే పాట గా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా బహిరంగ వేలం ద్వారా గుత్తే దారులు అంగడిని దక్కించుకుంటారు. ఏప్రిల్ నుంచి మార్చి వరకు అంగడి దక్కిం చుకున్న గుత్తేదారు పశువులు, మేకలు, గొర్రెలు ఇతర క్రయ విక్రయాలపై ఫీజు వసూలు చేసుకుంటారు. పశువులను వెయ్యి వరకు 30 రూపాయల చొప్పున, ఆపై విక్రయాలకు ఆరు వందల రూపాయలకు మించకుండా వసూలు చేయాలి. గొర్రెలు, మేకలకు వందకు ఐదు రూపాయల చొప్పున వసూలు చేస్తారు. గుత్తేదారు పశువుల విలువలో పది శాతం మేరడబ్బులు వసూళ్లు చేస్తుండటంతో క్రయ, విక్రయదారులు లబోదిబో మంటున్నారు. నిబంధనల ప్రకారం వసూళ్లు జరిగేలా చూడాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

● రశీదు బుక్కులు వెనక్కి ఇవ్వని గుత్తేదారు

అంగడి దక్కించుకున్న గుత్తేదారుడికి మున్సిపాల్టీ అధికారులు స్టాంప్ వేసిన రశీదు బుక్కులు జారీ చేస్తారు. ప్రతి వారం రశీద్ బుక్కుల ద్వారా ఫీజు వసూలు చేయాల్సి ఉంటుంది. రశీదు బుక్ పూర్తి అయిన వెంటనే తిరిగి మున్సిపాల్టీకి అప్పగించాలి. ఇప్పటి వరకు పూర్తి అయిన రశీదు బుక్కులు తిరిగి వెనక్కి ఇవ్వలేదు. రశీదు బుక్కుల్లో కార్బన్ పెట్టకుండా అధికంగా డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి అంగడిలో వసూళ్లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

తాట్లవాయి అడవిలో వృద్ధురాలి మృతదేహం

● పెన్షన్ కోసం వెళ్లి మృత్యువాత

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

రాయికల్, జూన్ 24: రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామానికి చెందిన ఆవుల పోచమ్మ(60) అనే వృద్ధురాలు సోమవారం అడవిలో శవమై కనిపించింది. తాట్ల వాయి, కైరిగూడెం గ్రామాల మధ్య ఉన్న అడవిలో ఈ వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. స్థానికులు, ఏఎస్సై దేవేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోచమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటుందని, ఒక్క కూతురు, ఇరువురు కుమారులు ఉండగా, ఈ నెల 19న పెన్షన్ డబ్బులు తీసుకొని వస్తానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని ఏఎస్సై చెప్పారు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం బంధువులు వెతుకున్నారు. అయితే సోమవారం తాట్లవాయి గ్రామస్థులకు అనుమానాస్పద స్థితిలో కుళ్లిపోయిన మృతదేహం తమ గ్రామ శివారులోని అడవిలో చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మృతదేహం కుళ్లి పోయి దుర్వాసన వస్తుండటంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు ఈ శవం పోచమ్మదేనని ఆమె కూతురు గుర్తించిందని ఏఎస్సై తెలిపారు. దీంతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు వివరిం చారు. పెన్షన్ డబ్బుల కోసం వెళ్లిన వృద్ధురాలు అడవిలో మృతి చెంది ఉండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదవశాత్తు జారి పడటం వల్ల కానీ, మరే ఇతర కారణాల వల్ల చనిపోయి ఉండవచ్చని మృతురాలు కూతురు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశామని తెలిపారు. సంఘటనా స్థలాన్ని జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో యూపీ కార్మికుడి దుర్మరణం

కరీంనగర్ క్రైం, జూన్ 24: కరీంనగర్ మానేరు బైపాస్ రోడ్‌లో డీర్‌పార్క్ వద్ద సోమవారం ఉదయం 2.20 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికుడు సోను అలియాస్ సోను హసన్(26) మృతి చెందాడని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. సోను అతని బంధువులు కలిసి హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా కార్మికులుగా పనిచేస్తున్నారని, సోను ఆదివారం రాత్రి బైక్‌పై అర్జున్, రాజు, శ్యాంకుమార్‌లను వెనుక కూర్చుండబెట్టుకుని డ్యాంకట్ట పైకి వెళ్లి అక్కడే భోజనం చేసి తిరిగి బైక్‌పై హనుమాన్ నగర్‌కు వస్తుండగా అతివేగంగా వీధి దీపాల స్తంభానికి బైక్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రగాయాలతో సోను అక్కడికక్కడే మృతి చెందగా గాయాలైన అర్జున్, రాజు, శ్యాంకుమార్‌లను 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

వ్యక్తి పరిస్థితి విషమం

ఎండపల్లి, జూన్ 24: జగిత్యాల జిల్లాలోని ముంజంపల్లి గ్రామంలో ఓ ఆర్టీసీ బస్సు బైక్‌ని సోమవారం రాత్రి ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి కాలు నుజ్జు నుజ్జు అయింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంజంపల్లి గ్రామానికి చెందిన సట్ట రాజయ్య అటవీశాఖలో వాచర్‌గా పని చేస్తున్నాడు. పని పూర్తి చేసుకుని కుక్కలగూడూర్ వైపు నుంచి ముంజంపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ధర్మారం నుంచి గోదావరిఖని వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు చెట్ల కొమ్మలు బస్సుకు అడ్డు రావడంతో స్టీరింగ్‌ను తిప్పడంతో అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో రాజయ్య కాలు నుజ్జు నుజ్జు అయి తీవ్ర రక్తస్రావం అయింది. చేతికి కూడా తీవ్ర గాయమైంది. సంఘటనా స్థలంలో ఉన్న వారు వెంటనే రాజయ్యను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగానే ఉంది.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

సుల్తానాబాద్, జూన్ 24: సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాలకు చెందిన దాసరి రమ (33) అనే వివాహిత ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పూసాల గ్రామానికి చెందిన దాసరి రమను 15 ఏళ్ల క్రితం గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీశైలంకు ఇచ్చి వివాహం జరిపించారు. తగిన కట్న కానుకలతో పాటు ఉపాధి కోసం ఆటో ఇచ్చారు. కొంతకాలం కాపురం అనంతరం మరో ఐదు లక్షల రూపాయలను ఆదనంగా కట్నం కింద తేవాలంటూ రమను వేధింపులకు గురి చేశాడు. దీంతో రమ పుట్టింటికి వెళ్లగా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి నచ్చచెప్పారు. అయినా భర్త శ్రీశైలం, అత్త దాసరి కొమురమ్మ, తోటి కోడలు లక్ష్మి కలిసి రమను అనేక మాటలతో వేధించారన్నారు. దీంతో మనస్తాపం చెందిన రమ ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు రమ సోమవారం మృతి చెందింది. రమకు కూతురు, కొడుకు ఉన్నారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు.

ధూళికట్టలో వ్యక్తి అదృశ్యం



తిరుపతియాదవ్ (ఫైల్)

ఎలిగేడు, జూన్ 24: మండలం లోని ధూళికట్ట గ్రామానికి చెందిన కొండ తిరుపతియాదవ్ (40) ఈ నెల 22న ఉదయం నుంచి కనిపిం చడం లేదని జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి యాదవ్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా సెల్‌ఫోన్ సైతం ఇంట్లోనే పెట్టి వెళ్లాడన్నారు. సాయంత్రం వరకు చూసినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని బంధువులు, కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా లభ్యం కాలేదన్నారు. సుమారు 5.6అడుగుల ఎత్తు ఉండి తెలుపు రంగులో ఉన్నాడని తెలిపారు. తిరుపతి ఇంట్లో నుంచి వెళ్లినప్పుడు తెలుపు రంగు షర్ట్, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని వివరించారు. తిరుపతికి వరుసకు అన్న అయిన కొండ కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



గంగారాం (ఫైల్)

కోరుట్ల రూరల్, జూన్ 24: మండలంలోని సర్ప రాజుపూర్ గ్రామంలో సోమవారం 11 కేవి విద్యుత్‌తీగ తగిలి ఓ వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొక్కు నడిపి గంగారాం(60) రెండు రోజుల క్రితం కురిసిన గాలి వానతో ఇంటి ముందున్న రేకుల షేడ్ కొంత మేర ధ్వంసం అయింది. వాటిని సరి చేయడానికి సోమవారం షేడ్‌పైకి ఎక్కి రేకులను సరి చేస్తూ వాటిపై తాడిపత్రి కప్పుతున్న సమయంలో విద్యుత్ తీగలకు తగిలి షాక్ కొట్టడంతో గంగారాం షెడ్‌పైనే కుప్పకూలి గంగారం అక్కడిక్కక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో పోలీసులకు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గంగారాం భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

కొడిమ్యాల, జూన్ 24 : మండలంలోని తిర్మాలాపూర్ గ్రామానికి చెందిన అవునురి విష్ణువర్దన్‌ను గాయపర్చిన అదే గ్రామానికి చెందిన ఉల్లెందుల అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు విష్ణువర్దన్ ఆదివారం రాత్రి ఒంటరిగా వెలుతుండగా అంజయ్య కత్తితో దాడి చేయడంతో చాతికి ఎడమ చేతికి గాయాలయ్యాయి. పాత పగలను మనుస్సులో పెట్టుకొని చంపాలనే ఉద్దేశంతో దాడి చేశాడని గాయాలైన అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి తండ్రి అవునురి వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యా, వైద్యం మెరుగు కోసం సర్కారు కృషి

● వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, జూన్ 24 : విద్యా, వైద్యం మెరుగు కోసం ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందని అందుకోసం నిరంతరం కృషి చేస్తున్నామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మాస్ట్రో పాఠశాల యాజమాన్యం కొత్తగా ఏర్పాటు చేసిన ప్లే స్కూల్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం కొనసాగిస్తున్న అంగన్‌వాడీ పాఠశాలల తరహాలో ప్లేస్కూల్ ఏర్పాటు చేసి యాజమాన్యాలు పలువురికి ఉపాధి అందిస్తున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మూతబడ్డ ప్రభుత్వ పాఠశాలలను తెరిపించి అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మత్తుల కోసం కోట్లాది రూపాయలు కేటాయించారని చెప్పారు. విద్యార్థి ఒక్కరు ఉన్నా పాఠశాలను నడిపించాలని ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, పూండ్ర నారాయణరెడ్డి, తొట్ల అంజయ్య, కారపు గంగాధర్, గోపిడి ధనుంజయ్‌రెడ్డి, పులి హరిప్రసాద్ ఉన్నారు.

సూర్యగ్లోబల్ పాఠశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

జగిత్యాలరూరల్, జూన్ 24 : జగిత్యాల మండలంలోని సూర్యగ్లోబల్ స్కూల్ లో ఫ్రెషర్స్ డే వేడకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నూతనంగా వచ్చిన విద్యార్థులకు పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసి సీనియర్ విద్యార్థులచేత స్వాగతం పలికారు. దీనిలో భాగంగా చిన్నారులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మౌనికరావు, రజితారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధిపై ప్రత్యేక చొరవ

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు

కోరుట్ల, జూన్ 24 : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రత్యేక చొరవ చూపి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడానికి ప్రభుత్వ దృష్టి తీసుకపోనున్నట్లు కాంగ్రెస్ నియోజవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తెలిపారు. సోమవారం పట్టణంలోని నూతనంగా నిర్మాణం చేసి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్యులు సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మౌలిక వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రిలో వసతులను పరిశీలించి అవసరం ఉన్న వాటి వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నర్సింగరావు మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రితో పాటు వెటర్నరీ కళాశాలలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించే విధంగా కృషి చేస్తానన్నారు. పశువైద్య కళాశాల డీన్ దాసరి శ్రీనివాస్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ సునిత, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'నవ్య' ప్రభంజనం

జగిత్యాల అర్బన్, జూన్ 24: ఇంటర్ సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో జగిత్యాల నవ్య బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కరస్పాండెంట్ శ్రీపాద నరేష్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ మూడు విభాగాల్లో స్టేట్ ర్యాంకులు సాధించారన్నారు. ఎంపీసీ విభాగంలో మామిడిపెల్లి హేమశ్రీ 466లతో స్టేట్ 2వ ర్యాంకు, బైపీసీ విభాగంలో గడిపెల్లి హాసిని 436 మార్కులతో స్టేట్ 2వ ర్యాంకు, సీఈసీ విభాగంలో 483 మార్కులతో ఆకుల సాత్విక జిల్లా మొదటి ర్యాంకును సాధించిందన్నారు. వీరితో పాటు బొల్లారపు సోనియా, కండ్లపల్లి భావన స్టేట్ ర్యాంకులు సాధించారన్నారు. కళాశాల స్థాపించిన నాటినుంచి నాలుగేళ్లగా స్టేట్ ర్యాంకులు సాధిస్తున్నామని అందుకు సహకరించిన పోషకులకు, అచార్యులకు, ఆఫీస్ సిబ్బందికి కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్, ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్‌లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

● మేలో జరిగిన ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల అయినట్లు జిల్లా ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి నారాయణ తెలిపారు. ఫస్ట్ ఇయర్ జనరల్ విద్యార్థులు 3776 మంది పరీక్షలు రాయగా, 2476 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, సెకండ్ ఇయర్ జనరల్ విద్యార్థులు 2391 గానూ, 1197 మంది పరీక్షలు రాయగా, 50.6 శాతం ఉత్తీర్ణత సాదించారని తెలిపారు. వొకేషనల్ విభాగంలో ప్రథమ సంవత్సరం 381 మంది విద్యార్థులకు గానూ 182 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ద్వితీయ సంవత్సరంలో 435 మంది విద్యార్థులకు గానూ 199 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. తమ జవాబు పత్రాలను రీ వెరిఫికేషన్ లేదా రీ కౌంటింగ్ చేయించుకునేవారు విద్యార్థులు నిర్ణీత ఫీజును ఆన్‌లైన్‌లో 29వ తేదీలోగా చెల్లించాలని కోరారు.

●కోరుట్ల రూరల్, జూన్ 24 : రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫలితాలలో పట్టణంలోని మాస్ట్రో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేష్ తెలిపారు. కళశాలలో సీఈసీలో బోగ మహాలక్ష్మి 500 మార్కులకు 491, తహసీన్ 490 మార్కులు సాదించి టాపర్‌గా నిలిచినట్లు ఆయన తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు సత్తి సీతారెడ్డి, సంకోజీ నిహారిక, వాసాల వైష్ణవి, గుండెటి శార్యాణశ్రీ, 466 మార్కులు సాదించినట్లు రాజేష్ తెలిపారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు గుండేవేణి సుష్మశ్రీ, సాయిస్త నూరెన్ 437, సుహానా, ఫైజా తాహెర్ 436 మార్కులు సాదించినట్లు రాజేష్ తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు సన్మానించి అభినందిచారు.

బిల్లులు వెంటనే విడుదల చేయాలి

● కలెక్టర్‌కు తాజా మాజీ సర్పంచ్‌ల వినతి

వెల్గటూర్, జూన్ 24: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ సత్య ప్రసాద్‌కు ఉమ్మడి వెల్గటూర్ మండల తాజా మాజీ సర్పంచ్‌లు వినతి పత్రం సమర్పించారు. అప్పు చేసి మన ఊరు మన బడి పనులు పూర్తి చేసి రెండేళ్లు కావస్తున్నా బిల్లులు మాత్రం విడుదల చేయడం లేదని వాపోయారు. సర్పంచ్‌ల పాలన కాలం ముగియడంతో బిల్లులు రాకపోతే తమ కుటుంబాలు వీధిన పడే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. వైకుంఠదామాలు, సీసీ రోడ్లు, రైతు వేదికలు, సంఘ భవనాలు, గ్రామ పంచాయితీ భవనాల నిర్మాణాలు చేపట్టి పనులు పూర్తి చేసినా బిల్లులు రాక పోవడంవతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ మృతి

మెట్‌పల్లి, జూన్, 24 : గుర్తు తెలియన వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో గాయపడ్డా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం...మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన వెంకట్రావుపేట గ్రామ జాతీయ రహదారిపై సుమారు వయస్సు 50 నుంచి 60 మధ్య గల గుర్తు తెలియని వ్యక్తిని ఈనెల 22 రాత్రి తెలియని వాహనం ఢీ కొట్టింది. గమనించిన స్థానికులు 108 వాహనంలో మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కొమిరెడ్డి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా పెద్దమ్మ దేవాలయ వార్షికోత్సవం

కోరుట్ల, జూన్ 24 : పట్టణంలోని పెద్దమ్మ దేవాలయ 15వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అభిషేకం, అర్చన, కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు విష్ణుశాస్త్ర, లలిత శాస్త్ర నామా పారయణం కార్యక్రమాలను నిర్వహించారు. వర్షాలు విరివిగా కురువాలని ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ - సరోజ దంపతులు ప్రత్యేక పూజలలో పాల్గొన్నగా నిర్వాహకులు సన్మానించారు. కోరుట్ల కాంగ్రెస్ నియాజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు ప్రత్యేక పూజలలో పాల్గొన్ని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారభించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వహకులు పాల్గొన్నారు.

'పెద్దాపూర్ గురుకలం పనులు పూర్తి చేయాలి'

మెట్‌పల్లి రూరల్, జూన్, 24 : మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులోని క్యాంపులోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలోని భవనాల పనులు త్వరగా పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. వర్షకాలంలో హాస్టల్ గదులలో విద్యార్థులు ఉండడానికి తగిన సౌకర్యాలు లేవు, ప్రస్తుతం ఉన్న రేకుల షెడ్ కురుస్తున్న వర్షాలకు ఎప్పుడు కూలిపోతుందోనని అనే భయం విద్యార్థులు, ఉపాధ్యాయులలో మొద లైంది. వెంటనే గురుకులంలోని సమస్యలు, నూతన భవనం పనులు పూర్తి చేయాలని కలెక్టర్ పూర్తి చేయించాలని వినతి పత్రం ద్వారా కోరామన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో విద్యార్థుల తల్లిదండ్రులు చౌటుపల్లి అంజయ్య, గడ్డం రాజారెడ్డి, మేండె రమేష్, రాజారపు రాజేష్, గుంటుక రాజు, బండ మల్లయ్య, ఆమెటి అశోక్ ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

● శిలాఫలకం వేసి తొమ్మిదేళ్లు- పూర్తయ్యేది ఎన్నేళ్లకో

● అసంపూర్తి నిర్మాణంతో ప్రజలు ఇబ్బందులు

పెగడపల్లి, జూన్ 24 : బ్రిడ్జి నిర్మాణానికి రూ. కోటి మంజూరుతో తాము ఎన్నో ఏళ్ల నుంచి పడ్డ ప్రయాణ కష్టాలు తీరనున్నాయని ఆశపడ్డ ఆ గ్రామాల ప్రజల ఆశలు అసంపూర్తి నిర్మాణంతో అడియాశలే అయ్యాయి. పెగడపల్లి మండలంలోని యాపల్ చెరువు మత్తడి కింద బ్రిడ్జి నిర్మాణం చేపడితే మండలంలోని ఏడుమోటలపల్లి, రామబద్రునిపల్లి, ల్యాగలమర్రి, ఎల్లాపూర్ గ్రామాల ప్రజలకు మూడు కిలోమీటర్ల దూరం తగ్గి నిత్యం మండల కేంద్రానికి రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది. ఈ విషయమై ఎన్నో ఏండ్లుగా బ్రిడ్జి నిర్మాణం కోసం ఆయా గ్రామాల ప్రజలతో పాటు మండల కేంద్రంలోని బ్రిడ్జికి అవతల పంట పొలాలు ఉన్న రైతులు అధికారులకు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలకు మొరపెట్టుకోగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ వెంటనే అప్పటి ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొప్పుల ఈశ్వర్ రూ. కోటి నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరు, టెండర్ ప్రక్రియ పూర్తి కాగా 23 మార్చి 2016న బ్రిడ్జి నిర్మాణ పనులు సైతం ఎంతో అట్టహాసంగా భూమిపూజ చేసి పనులకు శంఖు స్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణ పనులు చేపట్టి నత్తనడకన పనులు కొనసాగించి బ్రిడ్జి నిర్మాణం స్లాబ్ మాత్రమే వేసి, నిధులు సరిపోవడం లేదని బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయకుండానే వదిలేశారు. దీంతో దాదాపు ఎనిమిదేండ్లుగా అర్థాంతరంగా వదిలేసిన బ్రిడ్జిని ఎప్పుడు తిరిగి పనులు ప్రారంబిస్తారా అంటూ ఆ ప్రాంత రైతులు, ఆయా గ్రామాల రైతులు ఎదురు చూస్తున్నారు. రూ. కోటి నిధులకు సార్థకత చేకూరాలంటే ఈ ప్రభుత్వంలోనైనా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించి మరిన్ని నిధులు మంజూరు చేసి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించి ప్రయాణ బాధలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఏడుమోటలపల్లి తండా రోడ్డులో అసంపూర్తిగా ఉన్న బ్రిడి

ప్రజాధనం వృధా చేస్తున్నారు

మాదారపు ప్రశాంత్ రావు, పెగడపల్లి.

కోటి రూపాయలు నిధులతో నిర్మాణం చేపట్టి దాదాపు పదేండ్లుగా అర్థాంతరంగా వదిలేయడం ప్రజాధనం వృదా చేయడమే. అసంపూర్తిగా వదిలేసిన బ్రిడ్జి ప్రారంబానికి నోచుకోకముందే శిథిలావస్థకు చేరినట్లుగా అగుపిస్తుంది. ఇప్పటికైనా నిర్మాణ పనులు పూర్తి చేయించి ఇప్పటికే వెచ్చించిన కోటి రూపాయలకు సార్థకత చేకూర్చాలి.

ఈ ప్రభుత్వంలోనైనా పనులు పూర్తి చేయించాలి

మూల గోపాల్ రెడ్డి, పెగడపల్లి

దాదాపు పదేండ్లవుతున్నా బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిన బ్రిడ్జి నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పట్టించుకుని ఇప్పటికైనా నిర్మాణ పనులు పూర్తి చేయించి ప్రయాణ దూరభారం తగ్గించాలి.

ప్రాణం పోయినా పార్టీ మారేది లేదు

● ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి

● సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

ఇబ్రహీంపట్నం, జూన్ 24: ప్రాణం పోయిన బీఆర్ఎస్ పార్టీని వీడి వేరే పార్టీ మారేది లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయలంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి-జగన్‌రావుల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు ఎజెండా అంశాలను చదివి వినిపించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు సభా దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజకీయ నాయకులు పదవి ఉన్నా లేకున్నా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవ చేయాలన్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారుతున్నారని అటువంటి వారికి ప్రజలే తగిన బుద్ధి చెపుతారని అన్నారు. తన ఉద్యమం నుంచి ఇప్పటి వరకు బీఆర్ఎస్‌తోనే ఉన్నానని ఇప్పటికీ ఎప్పటికీ ప్రాణం ఉన్నంత వరకు పార్టీలోనే కొనసాగుతానని అన్నారు. కొందరు కావాలనే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అటువంటివి మానుకోవాలని కోరారు.

మండలానికి రుణపడి ఉంటా : ఎంపీపీ

ఇబ్రహీంపట్నం మండలానికి, గోధుర్ గ్రామానికి రుణపడి ఉంటానని ఇబ్రహీంపట్నం ఎంపీపీ జాజాల భీమేశ్వరి-జగన్‌రావు అన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీల పదవి కాలం జూన్4తో ముగుస్తుండటంతో మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జాజాల భీమేశ్వరిని, ఎంపీటీసీ సభ్యులను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్ పూల మాలలు, శాలువతో సత్కారించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఎంపీపీ జాజాల భీమేశ్వరి మాట్లాడుతూ తన రాజకీయంగా ఎదుగుదలకు తోడ్పాటును అందించిన మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు, ఎమ్మెల్యే సంజయ్‌కు, ఇబ్రహీంపట్నం మండల ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు రుణపడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కముటం భారతి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన కోరుట్ల ఎమ్మెల్యే

మెట్‌పల్లి, జూన్, 24 : కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్‌లను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మర్యాద పూర్వకంగా కలిసారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టర్ కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో అశోక్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కోరుట్ల నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్యలపై కలెక్టర్‌తో చర్చించినట్లు, శాంతి భద్రతల విషయంలో ప్రత్యేక దృష్టి సారించి రాజీలే కుండా పని చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే

పార్టీ మారుతానన్న ప్రచారం అబద్ధం : ఎమ్మెల్యే

కోరుట్ల, జూన్ 24 : తాను బీఆర్ఎస్‌ను విడిచి కాంగ్రెస్ చేరుతానని వస్తున్న వదంతులను అబద్ధమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కొట్టిపాడు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం డాక్టర్ సంజయ్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలసి మాట్లాడారు. తాను మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు అద్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే టికెట్ పొంది విజయం సాధించానని తాను పార్టీ మారుతున్నాని వస్తున్న ప్రచారం నియోజకవర్గంలోని ప్రజలు నమ్మవద్దని అన్నారు. మంత్రి పదువులతో పాటు అధికారం కోసం తాను పాకులాడనని ప్రజలు ఇచ్చిన తీర్పుకు కట్టుబడి ఉంటానని అన్నారు.

ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన వారికి పురోగతి ఉండదని అన్నారు. తాను కేసీఆర్, కేటీఆర్ సారథ్యంలో పని చేస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేష్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

రాయికల్, జూన్ 24: తెలంగాణ క్రీడా పాఠశాలల్లో 2024-25 సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 26న రాయికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో గంగాధర్ తెలిపారు. ఇందులో పాల్గొనే బాల, బాలికలు 01-09-2015 నుంచి 31-08-2016 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ఆధార్ కార్డు ఒరిజినల్, జిరాక్స్, స్టడీ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్, మూడవ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, కులం సర్టిఫికెట్‌తో పాటు 10 ఫొటోలతో 26వ తేదీన ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలన్నారు. వివరాలకు పీడీ క్రిష్ణప్రసాద్ 9440037393, పీడీ గంగాధర్ 9949347048లను సంప్రదించాలని సూచించారు.

కొడిమ్యాల: ఈ నెల 26న మండల స్థాయి క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో అయిత శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఎమ్మార్సీ భవనంలో పీడీ, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ నాలుగవ తరగతిలో ప్రవేశాలు హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాదు క్రీడా పాఠశాలలకు ఎంపికలు మండల స్థాయిలో కొడిమ్యాలలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు విద్యార్థులు పీడీ రాజమల్లయ్యను కలు వాలన్నారు.

మల్యాల: కరీంనగర్, ఆదిలాబాద్, హకీంపేటలో గల స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగవ తరగతి ప్రవేశాలకు గాను మంగళవారం మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి అయిత శ్రీనివాస్ తెలిపారు. పోటీలలో పాల్గొనేందుకు గాను విద్యార్థులు తమ 3వ తరగతి ఉత్తీర్ణత ప్రోగ్రెస్ కార్డు, స్టడి సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, జనన ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. ఈ పోటీలలో ఎత్తు, బరువు, పరుగు పందెం, వర్టికల్ జంప్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, మెడిసిన్ బాల్ త్రో తదితరవి ఉంటాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెగడపల్లి : మండల స్థాయి క్రీడల పాఠశాల ఎంపిక పోటీలు బుదవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. బాల బాలికలు ప్రస్తుత విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతూ ఉండి 1 నవంబర్ 2015-31 ఆగస్టు 2016 మధ్యన జన్మించిన వారై ఉండాలన్నారు. బాల బాలికలు బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్‌తో ఎంపిక పోటీలకు హాజరు కావాలన్నారు. వివరాలకు డి.రమేష్ పి.డిని 9491109138 నంబరుకు సంప్రదించాలని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

ధర్మపురి, జూన్ 24: రైతులకు రూ 2 లక్షలు రుణ మాఫీ ప్రకటనను హర్షిస్తూ ధర్మపురి మండల కేంద్రంలోని నంది విగ్రహ చౌరస్తా వద్ద సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్ష పాతిగా ఉందని అన్నారు. సీఎం రైతులకు రూ 2 లక్షలు రుణ మాఫీ చేసినందులకు ఇందుకు సహకరించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, మున్సిపల్ కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మైనార్టీ అధ్యక్షుడు ఎండీ రఫియొద్దీన్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్ పాల్గొన్నారు.

పెగడపల్లి : మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఏక కాలంలో రూ. రెండు లక్షలు మాఫీ చేస్తామని ప్రకటన చేయడాన్ని స్వాగతిస్తూ క్షీరాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఒరుగల శ్రీనివాస్, నాయకులు కడారి తిరుపతి, చాట్ల విజయ్ భాస్కర్, అమిరిశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బుగ్గారం : రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాల మాఫీ ప్రకటన చేయడాన్ని హర్షిస్తూ సోమవారం బుగ్గారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాబిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్, అసెంబ్లీ యూత్ ప్రధాన కార్యదర్శి సిగిరి అంజిత్ కుమార్ పాల్గొన్నారు.



ధర్మపురిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

గొల్లపల్లి: మండల కేంద్రంలో స్థానిక అధికార పార్టీ శ్రేణులు సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్ర పటాలకు సోమవారం క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో తరలివచ్చిన పార్టీ శ్రేణులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారిపై సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లంభ ధనవ్వలక్ష్మన్, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు గంగాధర్, సత్యానారాయణ, వెంకటేష్ గౌడ్, నాయకులు సంతోష్, అనిల్ కుమార్, మహేష్, బుచ్చి రెడ్డి, దిలీప్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కొడిమ్యాల: మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహిస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఆన్ లైన్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమియుద్దీన్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర మందులతో పాటుగా ఓఆర్ఎస్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి ఆదేశించారు.

●గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 26న చలో కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీ యు జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, కార్యదర్శి పులి మల్లేశం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

●వర్షాలు కురవాలని వరుణ దేవున్ని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని రైతులు బిందెలతో నీటిని తీసుకపోయి గ్రామంలోని వివిధ ఆల యాల్లోని ఉత్సవ మూర్తులకు తడి బట్టలతో జలాభిషేకం చేశారు. అనంతరం పూజలు చేశారు.

●ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు కొడిమ్యాలలో పెట్రోలింగ్ చేస్తుండగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

మల్యాల: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యేను సోమవారం మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్, మాజీ మంత్రి రాజేశంగౌడ్, గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ హైదరాబాద్‌లో పరామర్శించారు.

పెగడపల్లి : పెగడపల్లి మండలంలోని లింగాపూర్ మాజీ సర్పంచ్ స్వర్గీయ ఈరెల్లి శంకర్ కుటుంబానికి మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈరెల్లి శంకర్ గత సంవత్సరం నవంబర్ 15న హఠాన్మరం చెందగా పార్టీ నాయకులు తలా కొంత పోగు చేసి రూ. 27 వేల 500లు సోమవారం ఆయన భార్యకు అందజేశారు. పార్టీ నాయకులు బుర్ర రాము లు గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలో రాయపట్నం, ధర్మపురి శివారులో అక్రమ ఇసుక డంపులకు ఈ నెల 26న వేలం వేయడం జరుగుతుందని తహసీల్దార్ కృష్ణచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగి ఉన్న వ్యక్తులు ఈ నెల 26న ఉదయం 11-30 గంటలకు వచ్చి ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

●ధర్మపురి: పట్టణంలోని తుమ్మళ్లకుంటలో పడి రాజనర్సు(60) సోమవారం మృతి చెందాడు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ సీఐగా వై. కృష్ణారెడ్డి సోమవారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ కి సిబ్బంది స్వాగతం పలికారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని సీఐ తెలిపారు.

బీర్‌పూర్: మండల కేంద్రంలోని ఫిల్టర్ బెడ్‌ను సోమవారం మిషన్ భగీరథ ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్ పరిశీలించారు. ఇటీవల ఫిల్టర్ బెడ్ మరమ్మతుల కోసం రూ.3కోట్ల 70లక్షలు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ త్వరలోనే పూర్తి చేసి పనులు ప్రాంభించనుండడంతో ఫిల్టర్ బెడ్‌ను అధికారుల బృందం పరిశీలించింది. ఫిల్టర్ బెడ్‌కు నీరు ఎక్కడి నుంచి సప్లై చేస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

●అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బీర్‌పూర్ తహసీల్దార్ నరేష్ అన్నారు. సోమవారం మండలంలో రెవెన్యూ, పోలీస్ ఆద్వర్యంలో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న పరిసర ప్రాంతాలపై తనిఖీలు నిర్వహించారు. మండలంలోని రంగాసాగర్, కమ్మునూర్, మంగేళ, రేకులపెల్లి, చిన్నకొల్వాయి గ్రామ సమీపంలోని పరిసర ప్రాంతాలలో అక్రమంగా ఇసుక డంపుల నిల్వలు ఉన్నాయేమోనని అనువనువునా గాలించారు. అదే సమయంలో గోదావరి నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న బీర్‌పూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు.

జగిత్యాల: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సోమవారం హైద్రాబాద్‌లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. జగిత్యాల శివారులోని నూకపల్లి వద్ద డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద మౌళిక వసతులు, నిర్మాణాలు పూర్తి చేయాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని ఆయన కోరారు. రానున్న వారం రోజుల్లో జగిత్యాలకు వచ్చి కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్షించి సమస్యను పరిష్కరిస్తానని మంత్రి శ్రీనివాస్ రెడ్డి హామీనిచ్చినట్లు ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు.

రాయికల్: జగిత్యాల జిల్లా పద్మశాలి సంఘం కోశాధికారి తుమ్మ రాజేశం తల్లి అనారోగ్యంతో మృతి చెందగా రాయికల్ పట్టణంలోని తన నివాసంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి సోమవారం పరామర్శించారు. రాయికల్ పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బన్న సంజీవ్ కూతురు అనారోగ్యంతో చికిత్స పొందుతుం డగా పరామర్శించారు.

●జగిత్యాల కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డికి ఎలాంటి సమాచారం లేకుండా ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లాకు చెందిన కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వాకిడి సత్యం రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీకి పనిచేసిన జీవన్‌రెడ్డిని అగౌరవపరచడం భరించలేక రాజీనామా చేస్తున్నానని స్పష్టం చేశారు. లేఖను డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డిలకు పంపుతున్నట్లు తెలిపారు.